


## మెలాంకొలీ

కిటికీ దగ్గర నిలబడి ఉంది కళావతి. బయటికి చూస్తూ ఉందామె.

మబ్బులతో నిండి ఉన్న ఆకాశం నీలాన్ని దాచేసు కుని బూడిద రంగులో బరువుగా నింపాదిగా కదుల్తూంది. గాలి పిచ్చి పట్టినట్లుగా అటూ ఇటూ పరుగులు తీస్తూ చెట్ల తలల్ని ఊపుతూ, వంపుతూ ఊరకే సంతోష పడుతూంది.

అప్పటికి మధ్యాహ్నం ముగిసి సాయంత్రం కాబో తూంది. వీధి కటు వైపున వేప చెట్టు కింద కూర్చుని అమ్మ లక్కలు కాళ్ళు బారజాపుకుని కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్యలో నవ్వు తున్నారు. ముట్టుకునే ఆట ఆడుతున్నారు గావును దొడ్లో ఇద్దరు ఆడపిల్లలు ఒకరి నొకళ్ళు చేజ చేసు కుంటూ కేరింతలు కొడుతున్నారు.

వాళ్ళంతా అంత సంతోషంగా ఎలా ఉండ గలుగుతున్నారు? తనెందుకు ఉండలేకపోతూంది

పల్లటి చిన్న పిట్ట ఒకటి మధురంగా ఈల వేస్తూ ఉండి ఉండి ముునగచెట్టు మీంచి గాలిలోకి డైవ్ చేస్తూ వెర్రిగా తన ఆనందాన్ని వ్యక్తం చేసుకుంటూంది.

కళావతికి మనసంతా ఏదో దిగులుగా—బరువుగా ఉంది. ప్రకృతి అంతా ఇంత ఫ్రెష్‌గా—సజీవంగా చిందులు వేస్తున్నా తనలో మాత్రం లేశమైనా సంతోషం కలగడం లేదు. ఏమి టిదంతా? బతుకు ఇట్లా ఉంది ఎందుకని. . .

వాళ్ళలా? దుఃఖం ముంచుకొచ్చింది కళావతికి.

ఏమి బతుకు? ఏమి బతుకు?

తన బాధ ఏమిటో, తన దిగులేమిటో ఆమెకే స్పష్టంగా తెలియటం లేదు. డిప్రెషన్! జిగట లాంటి ద్రవ మేదో మెదడు నిండా నిండి ఉన్నట్లూ, ఏవేవో ఆలోచనలూ, అర్థంకాని దిగుళ్ళూ మనసు నిండా పెనవేసుకని చిక్కు ముడుల్లా ఏర్పడి పోయి ఆమె హృదయాన్ని నలిపి వేస్తున్నాయి. ఒక పెద్ద నిరాశ—ఆకాశానికీ భూమికీ మధ్య పట్టే టంత నిరాశ మనస్సు నిండా ఆవరించుకుని, శరీరం ఇక ఏ మాత్రమూ మోయలేదన్నట్లుగానూ, దాన్నంతా బయటికి వదిలి వేయ్యాలి కన్నట్లుగానూ ఉండి ఉండి ఆమె బరువుగా పెద్ద శబ్దం చేస్తూ నిట్టూర్పులు విడుస్తూంది. . .

కొద్ది క్షణాల తరువాత లోపలి గదిలో మంచం మధ్య కూర్చుని ఉందామె. మంచం మీద ఆమె చుట్టూ పరిచి వేయబడ్డ రేపర్‌లూ, ఒక వేపున ప్లేటులో తత్సంబంధమైన టాబ్లెట్లూ ఉన్నాయి. ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. చేతులు వణుకుతున్నాయి. మధ్య మధ్య మంచినీళ్ళు తాగుతూ వరసగా ఒకో టాబ్లెట్‌నూ నోట్లో వేసుకుని మింగ సాగిందామె.

## ఎంక్వయిరీ

హాస్పిటల్ లోని గదిలో మంచం మీద పడుకుని ఉంది కళావతి. ఆమె మొహం వడిలిపోయి ఉంది. కళ్ళు పీక్కుపోయి, అలసటతో నీరసంగా కనిపిస్తూం దామె. గుండ్రంగా తిరుగుతున్న సీలింగు ఫాను వేపు ఏదేకంగా చూస్తూం దామె ఇందాకటి నుంచీ.

మంచం పక్కనే స్టూలు మీద కూర్చుని ఉన్నాడు రాఘవరావు—ఆమె భర్త. ఆమె మొహం వేపే చూస్తున్నా డతను. చాలా సేపటి నుంచి వాళ్ళిద్దరూ అలా మాట లేకుండా మౌనంగా ఉన్నారు.

ఆఖరికి రాఘవరావు నిశ్శబ్దాన్ని భగ్నం చేశాడు.

''ఎందుకు చేశావు కళా నువ్వా పని?''

సమాధానం చెప్పలే దామె. చూపు నన్నా పక్కకు మరల్చలేదు. అలా సీలింగు వేపు చూస్తూ ఉండి పోయింది.

''నీకు నే నేమన్నా లోపం చేశానంటావా?'' మళ్ళీ అడిగా డతను.

తల ఇటు తిప్పి నీరసంగా చూసిం దామె భర్త వేపు.

''ఎందుకంటారు అట్లాంటి పాడు మాటలు?''

''లేదు కళా, సంసారం చేసుకునే స్త్రీ ఆత్మ హత్యకు పాల్పడిందంటే లోకం మొదటగా అందుకు కారణం ఆమె భర్తే నంటుంది. ఆతడికి తనను తాను డిఫెండ్ చేసుకోవడానికికూడా అవకాశం ఉండదు. . .''

కళావతి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

''నన్ను క్షమించండి.''

''క్షమించటం కాదు. నాలో ఏదన్నా లోప ముండటమో లేక నిన్నేమైనా కష్ట పెట్టడమో జరిగి ఉంటే సరి చేసుకోవటానికి ప్రయత్నిస్తాను. అసలు నువ్వెందుకని చచ్చిపోవాలనుకున్నావు?''

''దయచేసి నన్నేమీ అడక్కండి'' అటువేపుకు తిరిగి పడుకుం దామె.

బాధగా చూశా డతనామె వేపు. ఆమె పిరుదులు వీపు, విడిపోయిన వెంట్రుకల పాయలూ కనిపిస్తున్నా యతనికి.

"అంత చెప్పకూడని రహస్యమా కళా?" రుద్ధ మయిం దలని స్వరం.

"అబ్బా పన్నెండు కిలా వేపుకు తింటారు అంత కంటే ఒక్కసారిగా చంపేయండి. ఎదురు బాడు కుందామె ఇటు వేపు తిరక్కుండానే.

"సరే, సరే కళా" అంటూ అతను లేచి నిలబడ్డాడు.

## రెట్రాస్పెక్ట్


అవును, తనెందుకు ఆత్మహత్యకు ప్రయత్నించింది? అసలు తాను ప్రశ్నించుకుంది కళావతి. ఆమెకే అర్థం కాలేదు. ఏదో విరక్తి, ఏదో దిగులు, ఏవో అసంతృప్తి తన నలా ప్రేరేపించాయి. కాని ఎందుకు? ఏ కారణం వల్ల? ఏమో, ఏమో. . . జుట్టు పీక్కుం దామె.


కళావతికి చిన్నప్పటి నుంచి కలలు కనే అలవాటుంది. ఆ కలలు కనడ మనేది ఆమెకు పుస్తకాలు చదవటం మూలంగా అబ్బింది. అప్పట్లో ఆమె తనకోసం ఎవరో రాజకుమారుడు గుర్రం మీద వస్తాడనీ, అతడు తనను తీసుకుపోయి సింహాసనం మీద పక్కనే కూర్చుండ బెట్టుకుని చక్కగా ప్రేమగా చూసుకుంటాడనీ కలలు కనేది. కలలంటే నిజమైన కలలుకాదు. డే డ్రీమ్స్! ఆ తర్వాత ఆమె టీనేజీల్లోకి మారి వయస్సు వికసిస్తున్న తరుణాన ఆమె చదివే పుస్తకాలూ, తద్వారా ఆమె డ్రీమ్సూ మారిపోయాయి. ఈ దశనుండీ ఆమె తెలుగు సాహిత్యాన్ని ఆపోసన పట్టటం సాగించింది. తెలుగు సాహిత్యమంటే ఏమిటో అందరికీ తెలుసు. పుంఖాను పుంఖంగా వెలువడుతూ, తెలుగు పత్రికల్ని పుష్టివంతం చేస్తున్న ఒక రకమైన ఆడరచనలూ, ఆడంగి రచనలూ ఆమెలో అతిశయోక్తితో కూడుకున్న వూహాజీవుల్ని సృష్టిస్తూ, కలల్ని ప్రేరేపిస్తూ ఆమె మనస్సును టీనేజి స్థాయినుంచి ఎదగకుండా అరికడుతుంటే — మరో రకం రచనలు— ఇరుకు దృక్పథాలుగల ఒక రిద్దరు ఫ్రిజిడ్ రచయిత్రులు రాస్తున్న రచనలు— పురుషుల పట్ల అకారణమైన ద్వేషాన్నీ, అసహ్యాన్నీ రెచ్చగొడుతూ ఆమె మనస్సును కోతికీ నాతికీ చెందకుండా తయారు చేశాయి. ఇవన్నీ కాకుండా చాలా మంది ఆడవాళ్ళలా ఆమెలో కూడా తనో మహా సౌందర్య రాశి నన్న వానిటీ ఒకటి దాగి ఉంది. 'బస్, ఆమె వాస్తవాన్నీ అంగీకరించక, రీజన్‌నీ ఆశ్రయించక వివాహం నాడే ఏ రకంగానూ ప్రత్యేకతలు లేని మామూలు మానవుడు తన భర్తను చూసి 'బస్, ఈ మాత్రం మనిషేనా?!' అన్న అలసత్వాన్నీ అయిష్టాన్నీ ఏర్పరచుకుంది అతని పట్ల. తర్వాత తర్వాత సంసారం చేస్తున్న రోజుల్లో ఆ అలసత మనస్సులో మూల మూలలకు పోయి దాక్కోగా, ఆ స్థానంలో ఆమెకే తెలియని అసంతృప్తీ, నిర్లిప్తతా, విరక్తీ ఆక్రమించుకుని ఆమెలోని ప్రాథమిక అయిష్టాన్ని ఆమెకే తెలియనీయకుండా దాచేసి, ఆమె మనస్సునొక మెలాంకొలిక్ ముద్దగా తయారు చేసి వదిలిపెట్టాయి ...

## సైకోపాథాలజీ

కళావతి ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ కూర్చుంటుంది ఇంటి పనులు లేని సమయాల్లో. తెలుగులో వెలువడే ముఖ్యమైన వార, మాస పత్రికల్ని రెగ్యులర్‌గా తెప్పించుకుంటుం దామె. వాటిల్లోని కథలకంటే సీరియల్సూ, నవలికలూ ఆమె నమితంగా ఆకర్షిస్తాయి. వాటిల్లో సాధారణంగా ఏమి ఉంటాయో ఎవరూ ఎరగంది కాదు— ట్రయాంగిల్ ప్రేమలూ, వివాహవిచ్ఛిన్నాలూ, సినిమాలలో భారీ సెట్టింగులకు పనికివచ్చే సన్నివేశాలూ మనుష్యుల్ని బద్ధకస్తులుగానూ, డ్రీమర్సు క్రింది మార్చే మత్తు పదార్థాలు!

కాస్త ఖాళీ దొరికితే చాలు, ఆమె తను అంతకు ముందు చదివిన లేక తనకు నచ్చిన పుస్తకంలోని డైలాగుల్నీ, సన్నివేశాల్నీ, హీరో హుందాతనాన్నీ ఉదాత్త లక్షణాల్నీ మననం చేసుకో ప్రయత్నిస్తుంది ఆ క్షణాన తనా హీరోయిన్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేస్తుంది. ఓహ్! ఎంత మధురమైంది జీవితం! మళ్ళీ తిరిగి వాస్తవం లోకి వచ్చేసరికి తన చుట్టూ ఉన్న మామూలు పరిసరాలు, ఆ పెంకుటిల్లు, ఆ పల్లెటూరు. అవన్నీ రోతని క్రియేట్ చేస్తాయామెలో. ఆ తరవాత కాసేపటికి భర్త ఇంట్లోకి ప్రవేశిస్తాడు. డిగ్రీ పూర్తి చేసి, వ్యవసాయంలో స్థిరపడి పోయిన రాఘవరావు గూడ కట్టు, లాల్చీ. భుజం మీద తువ్వాలుతో, అలవాటు పడిపోయిన పల్లెటూరి యాసతో, మధ్య మధ్య





గాలు పదారు పూళతో ఎంత మామూలు—ఎంత మామూలు! చప్పున కుంగిపోతుం దామె మనసు.

రాత్రులు ఆమె కెంతకీ నిద్ర పట్టదు. పొరల్లా పని చేసి ఉండటం వల్ల అవతల మంచం మీద గాఢంగా నిద్ర పోతూ కొద్దిగా నోరు తెరిచి గురక పెడుతున్న భర్త వేపు చూస్తుంది కొద్ది సేపు తదేకంగా. చటుక్కున ఏదో గుర్తు కొచ్చిన దానిలా అద్దం తీసుకుని అందులో తన మొహాన్ని చూసు కుంటుంది. మళ్ళీ వెంటనే భర్త మొహంలోకి చూస్తుంది. ఒక్కసారిగా నిరాశ ముంచెత్తుతుంది ఆమెను. ఎంత అన్యాయం జరిగిపోయింది తనకు?

ఆ నాంటి రాత్రులు ఆమెకు విచిత్రమైన కలలు వచ్చేవి. తన భర్త చనిపోయినట్లూ, తనాతని మృత దేహం వద్ద కూరుని ఏడుస్తున్నట్లూ, చుట్టూ గుమిగూడిన అనేక మంది బంధు మిత్రులు తన వేపు ఈసర్‌గానూ, జాలిగానూ చూస్తున్నట్లూ, కాసేపయాక వాళ్ళలోంచి ఒక వ్యక్తి తన వద్దకు వచ్చి తన పక్కనే మోకాళ్ళ మీద కూర్చుని తన చెంపల మీంచి జారుతున్న కన్నీటిని తుడవటం, తనాతని భుజం మీద తల వాల్చి తృప్తిగా హాయిగా కళ్ళు మూసుకోవటం. . . ఇదీ ఆ కల. ఉలిక్కి పడి నిద్ర లోంచి మేల్కొంటుంది కళావతి. పగ లంతా ఏ పని చేస్తున్నా ఆ కలను జ్ఞప్తికి తెచ్చు కోవటానికి ప్రయత్నిస్తుంది. ఛీ. పాడు. ఎంత పాడు కల ఎంత పాడు కల. కాని విచిత్ర మేమి టంటే, ఆ కల ఆమెలో విషాదాన్ని కలిగించాల్సింది పోయి ఆమె మనసులో ఎక్కడో స్వీట్ సెన్సేషన్‌ని క్రియేట్ చేసేది. అందులో భర్త మరణం కంటే తనను కొత్త వ్యక్తి ఓదార్చటమూ, తనాతని భుజం మీద తల వాల్చటమూ ప్రముఖంగా జ్ఞప్తి కొచ్చేవి. ఎవ రతను? కమలహాసనా? కోమలి మొగుడా? ఆ మధ్య ట్రెయిను ప్రయాణంలో తనతో కళ్ళు కలిపిన కుంటెగాడా? లేక వీళ్ళందరి కలగలుపూనా?

. . .

ఒక రోజు మధ్యాహ్నం ముందు గదిలో కూర్చుని పుస్తకం చదువుకుంటూ ఉం దామె. గుమ్మంలో చప్పు డయితే తలెత్తి చూసింది.

ఆ మనిషిని ఎక్కడో చూసినట్లుంది. గుర్తు పట్టటానికి విఫల ప్రయత్నాలు చేసిం దామె కొద్ది క్షణాల పాటు.

"ఏమి టలా వింతగా చూస్తున్నావ్?"

ఆ స్వరం వింటూనే తుళ్ళి పడిం దామె.

"అరె, మీరు—మీరు కదూ." సిగ్గు పడుతూ లేచి నిలబడింది.

"ఏమిటి నేను?"

"ఛీ పాడుదాన్ని—మిమ్మల్ని గుర్తు పట్టలేక పోయాను కదండీ."

క్షణం పాటు రాఘవరావు మొహం జలదరించింది.

## డైలాగ్

"కళా నీకు నాతో సంసారం చేయటం ఇష్టం లేదనుకుంటాను."

"ఎందుకనుకుంటారు అట్లా?"

"నువ్వెప్పుడూ పరాకుగా ఉంటుంటావు. ఆ పరధ్యానంలో నే నేది మాట్లాడినా సరిగ్గా వినిపించు కోక నా ప్రాణం తీస్తున్నావు. నాలుగేళ్ళ నుంచి కాపరం చేస్తూ కూడా ఒక్క పూట వ్యవధికే భర్తని గుర్తు పట్టలేకపోయావంటే దారుణం."

"నే నేం చేయనండీ, నాలో ఏదో జబ్బున్న ట్లుంది. . ."

"జబ్బూ కాదు పాడూ కాదు నువ్వు నన్ను గుర్తు పట్టలేక పోతున్నా వంటే నీ మనసు నన్ను భర్తగా అంగీకరించటానికి ఇష్ట పడటం లేదన్న మాట."

"మీ రట్లా అనుకుంటే నే నేమీ చెప్పలేను."

"అదంతా ఎందుకు కాని కళా ఈ స్టేజిలో మన కున్నది ఒక్కటే మార్గం—విడాకులు."


"ఛీ. దయచేసి ఇంకెప్పుడూ అట్లాంటి మాట లనకండి."

"లేకపోతే ఏమిటో చెప్పు, ఇన్నేళ్ళ కాపరం తరవాతకూడా నీకు నా మీద ఇష్టం కలగటం లేదు. దానికి నీ లోపల పేరుకుపోయిన ప్రెజుడిస్‌లు కారణం కావచ్చు. ఏదైనా కానీ, ఇద్దరు స్త్రీ పురుషులు ఒకరి మీద ఒకరు మమకారంతో కాపరం చేయలేకపోతున్నప్పుడు అవి ద్వేషాల్లోకి మారక ముందే ఇద్దరూ దూరం జరగటం వివేక మైన విషయం. దానికి విడాకు లొక్కటే మార్గం. కాని నువ్వు అందుకూ ఒప్పుకోవు. ఇలా ఎన్నాళ్ళు? నా కయితే పొయ్యి మీద కుత కుతా మరుగుతున్న కాగు నీటిలో కూర్చున్నట్లుగా ఉంది. . ."

"అంటే నాకు మీ మీద కాకుండా వేరెవరి మీదో మనసుందని మీ ఉద్దేశ్యమా?"

"లేదు కళా. అట్లా అయినా బాగానే ఉండేది. ఆ వంకన నాకు నేనై నీకు విడాకు లివ్వటానికి అవకాశ ముండేది. . . అసలు నీకో ఉన్నది నా పట్ల ద్వేష భావ మన్నా కాదు, ప్రేమ రాహిత్యం. దాన్ని భరించలేకపోతున్నాను. . ."

"చాల్లే, ఇక వూరుకోండి."



## టోండెడ్ వానిటీ

రెండేళ్ళ తరవాత...

రాఘవరావు శ్యామసుందరి ఇంటికి వెళుతున్నాడు. ఇది చాలా విడ్డూరమైన వార్త. ఎందుకంటే శ్యామసుందరి చాలా అందగత్తె. చిన్ని పెదాల తోనూ, చక్కటి నేత్రాల తోనూ అమిత ఆకర్ష ణీయంగా ఉంటుంది. ఆమె కోసం వూళ్ళోని హేమా హేమీలే ప్రయత్నించి విఫలులయారు. అట్లాంటిది మామూలు సాదా మనిషి రాఘవరావు నామె ఏ రకంగా అంగీకరిస్తుంది? ఇది కళావతి అభిప్రాయం. కాని మన అభిప్రాయాలతోనూ, నమ్మకాల తోనూ అసలు సిసలు వాస్తవాలు ఏకీభవించాలని ఎక్కడా లేదు. ఆమె మనస్సు రాజీ పడాల్సిన సంఘటనలు జరిగిపోతున్నాయి. పుకార్లు ఆమె చెవి చుట్టూ జోరీగ శబ్దాలు చేస్తున్నాయి. ఆఖరుకు ఆమెలో చలనం కలిగింది. వాస్తవాన్ని ప్రత్యక్షంగా తెలుసు కోవాలనుకుంది. ఫలితంగా ఆ రాత్రి పదింటికి శ్యామసుందరి గది కిటికీ వద్ద నిలబడి ఉందామె. లోపలి దృశ్యం ఆమె గుండెల్ని క్షణం పాటు గడ్డ కట్టించింది. శ్యామసుందరి ఒళ్ళో తల పెట్టుకుని రాఘవరావు...సుతారంగా అతని చెంపల్ని నిమురుతూం దామె. వాళ్ళ చూపుల్లోని ప్రేమ భావమూ, ఆరాధనా. . .

కళావతికి పిచ్చెత్తినట్లయి చివాలున వెనక్కు తిరిగింది—పరుగెడుతున్నట్లుగా ఇంటి వేపు నడి చింది.

"ఎక్కణ్ణించి? దాని ఇంటి దగ్గర్నుంచేనా?" కోపంగా ప్రశ్నించిం దామె మరో గంట తరవాత ఇంటికి తిరిగి వచ్చిన రాఘవరావుని. అప్పటిదాకా ఆమె బాగా ఏడ్చి, ఏడ్చి ఉంది.

"దాని అంటే?" కొద్దిగా ఉలిక్కిపడుతూ అడిగాడు రాఘవరావు.

"మీకు తెలియదా, శ్యామసుందరి."

కొద్దిసేపు ఆమె మొహంలోకి చూశాడతను.

"అవును."

"ఎంత దుర్మార్గం!" కీచుమందామె.


బుజా లెగరేశాడు రాఘవరావు.

"చూడు కళా! "ఏ మనిషి ఒంటరిగా జీవించాలని కోరుకోడు. నే ననేది మానసి కంగా. తన ఎమోషనల్ జీవితానికి ఎవరో ఒకరు ఆసరాగా నిలవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అలా ఒక భార్య తన భర్త నుంచీ, భర్త తన భార్య నుంచీ ఆశించటం సహజం. భార్యగా నువ్వు నాకు అందివ్వలేని ఆ లోపాన్ని ఆసరాని శ్యామసుందరి అందిస్తూంది. . ."

దెబ్బ తిన్న లేడిలా చూసిం దామె. వెంటనే ఆమె మొహం పాలిపోయింది.

"నా జీవితం నాశన మయింది ఇన్నేళ్ళ నుంచీ కాపరం చేస్తున్నాము. విశ్వాస మన్నా లేకుండా మీ సుఖం మీరు చూసు కున్నారు. నేనుకూడా అట్లా చేయలేకేనా? నా కామాత్రం అవకాశాలు రాకేనా."

"ఆగు కళా ఆగు, మధ్యలో అన్నా డతను. "నువ్వేదో విశ్వాస మంటున్నావు. ఏమిటా విశ్వాసం?



నువ్వు నన్నేదో ఉద్ధరిస్తున్నా ననుకుంటుండబట్టే అలా అంటున్నావు కదూ. ఒక స్త్రీ తన భర్త తోనో లేక పురుషుడు భార్య తోనో సంసారం చేయటమన్నది ఉద్ధరణలోకి వస్తుందా? రాదన్న సంగతి నీకూ తెలుసు. అంటే నీ మనస్సులో మరేదో ఉద్దేశ్య ముంది. అదేమి టన్నది దాపరికాలు లేకుండా మాట్లాడుకోవాలంటే నేను నీకు తగనని మొదటినుండీ నీవు అనుకుంటూ రావటం. ఆ భావం నీలో జీర్ణించి పోబట్టే నన్ను అమితంగా అలక్ష్యం చేస్తూ నేను నీ కెంత చేరువగా రావాలని ప్రయత్నిస్తే నీ వంతగా నాకు మానసి కంగా ఎడంగా ఉంటూ వచ్చావు. ఇవాళ పరిస్థితి చేయి దాటి పోయిందంటే దానికి పూర్తి బాధ్యత నీదే అవుతుంది. ఇక మనకు మిగిలింది ఒకటే మార్గం—విడాకులు."

కళావతికి కళ్ళ నిండా నీళ్ళుబికాయి. చేతుల్లో మొహం దాచుకుని కొద్ది సేపు ఏడ్చిం దామె. మధ్యలో చివాల్న మొహం పైకెత్తి అరిచింది.

"దుర్మార్గుడా, నా బతుకును నాశనం చేశావు."

"పిచ్చిదానా, నువ్వేదో వెర్రి భ్రమల్లో ఉన్నట్లున్నావు. మన పటాల్లో దేముళ్ళ తలల చుట్టూ వెలుగు వలయాలు ఉంటాయి చూడూ, అట్లా మీ ఆడవాళ్ళ మనస్సుల నిండా వానిటీ వలయాలు ఉండి అవి వాస్తవాల్ని చూడ నివ్వవు. నువ్వేదో భూలోక రంభవనీ, ఏ గంధర్వుడో, పురూరవుడో మాత్రమే నీకు సరితగ్గ జోడీ అని అనుకుంటూ, ఆ భావాల్ని నీలో పెంచుకుంటూ సంసారాన్ని ఈడ్చుకొచ్చావు ఇన్నాళ్ళూ. నిజానికి కళావతీ, నువ్వనుకుంటున్న మహా సౌందర్య మేదీ నీలో లేదు సరికదా నువ్వు మామూలు అందగత్తెవన్నా కాదు. వయస్సులో ఉండి ఆరోగ్యంగా ఉన్న మనుషు లెవరైనా ఆ మాత్రం మిసమిసల్ని కలిగి ఉంటారు. ఇవాళేమైందో చూడు—ఎవరైతే నీకు సరితూగడని అనుకుంటూ వచ్చావో ఆ నీ భర్తనే మరో స్త్రీ—నీ కంటే అనేక రెట్లు అంద మైన స్త్రీ చేరదీసి, తను ఆరాధిస్తూ, అతడి చేత తను ఆరాధింప జేసుకుంటూంది. . ."

"ఆపం డిక" అరిచింది కళావతి.

ఏ ఆడదీ మరో ఆడదాని గురించిన పొగడ్తల్ని భరించలేదు. అందునా తన భర్తను తనకు దూరం చేసిన ఆడదాని అందం గురించయితే మరీ. . .

మొత్తంమీద రాఘవరావు కిదంతా చికాకు కలిగించింది. ఒక్క విసురున బయటికి నడిచాడు. గుమ్మం దాకా పోయాక అక్కడ ఆగి మళ్ళీ అన్నాడు.

"ఒక్క శారీరకంగానే కాదు కళా, మానసికంగా కూడా శ్యామసుందరి నీ కంటే చాలా అందగత్తె."

అతను వెళ్ళిపోయాక అలా ఏడుస్తూ కూర్చుండి పోయింది కళావతి. వరదలా దుఃఖం ఆమె మనస్సు లోంచి పొంగి పొర్లుకొస్తూంది. తీవ్రమైన వేదన, నమిలేసే నిరాశ మనుషుల్ని ఎట్లాంటి నిర్ణయాలు తీసుకోటానికి ప్రోత్సాహ పరుస్తాయో అట్లాంటి నిర్ణయానికి వచ్చిం దామె ఆఖరుకి. . . ✱

